సాక్షి
ఖమ్మం
మంగళవారం ; 20 ; మే ; 2025



ఫిర్యాదులు పరిష్కరించండి

గ్రీవెన్స్ డేలో అందే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఆదేశించారు. 8లో



ఉన్న వారిపైనే భారం !

ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్ విభాగంలో ఉద్యోగుల కొరతతో ఉన్న వారిపై భారం పడుతూ, పనుల్లో ఆలస్యమవుతోంది. 8లో

గరిష్టం / కనిష్టం
38° / 26°

వాతావరణం

జిల్లాలో మంగళవారం ఉదయం సాధారణ ఉష్ణోగ్రతలే ఉంటాయి. మధ్యాహ్నం పెరిగినా సాయంత్రానికి వాతావరణం చల్లబడుతుంది.

న్యూస్‌రీల్

వార్షిక ఆదాయ లక్ష్యాన్ని చేరుకోవాల్సిందే..



ఉద్యోగులకు సూచనలు చేస్తున్న పురుషోత్తం

ఖమ్మంక్రైం: ప్రభుత్వ సూచనల మేరకు రవాణా శాఖ ఉద్యోగులు వార్షిక ఆదాయ లక్ష్యాన్ని చేరుకోవాలని ఇన్‌చార్జ్ డిప్యూటీ కమిషనర్ పురుషోత్తం స్పష్టం చేశారు. ఖమ్మం రవాణా శాఖ కార్యాలయాన్ని సోమవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయనకు ఇన్‌చార్జ్ డీటీఓ వెంకటరమణ స్వాగతం పలకగా, ఉద్యోగులతో సమావేశమై సూచనలు చేశారు. పన్నులు చెల్లించని వాహనాలను గుర్తించి జరిమానా విధించాలని సూచించారు. అలాగే, సీజ్ చేసిన వాహనాలు ఏళ్లుగా తీసుకెళ్లకపోతే స్క్రాప్‌కు తరలించాలని తెలిపారు. ఈ సమావేశంలో ఏఓ సుధాకర్, ఏఎంవీఐ స్వర్ణలత, ఉద్యోగులు పాల్గొన్నారు.

నెట్‌బాల్ టోర్నీలో జైత్రయాత్ర

ఖమ్మం స్పోర్ట్స్: ఇటీవల జనగామలో జరిగిన రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్ నెట్‌బాల్ పోటీల్లో ఖమ్మం క్రీడాకారులు ప్రతిభ చాటారు. సంప్రదాయ నెట్‌బాల్ విభాగంలో బాలుర జట్టు తృతీయస్థానం సాధించింది. అలాగే, సబ్ జూనియర్ విభాగంలో జిల్లా బాలబాలికల జట్లు ద్వితీయస్థానంలో నిలిచాయి. అంతేకాక ఈనెల 25నుంచి మధ్యప్రదేశ్‌లో జరగనున్న జాతీయస్థాయి పోటీల్లో పాల్గొన్న రాష్ట్ర జట్టులో జిల్లా బాలబాలికలు పది మంది స్థానం దక్కించుకున్నారు. బాలురలో సాన్‌హిత్, హసిత్, సాకేత్, సంజయ్, నేహాల్, సూర్య ఎంపిక కాగా, బాలికల జట్టుకు అవంతిక, హరిణి, రిత్వికసహస్ర, సింధు ఎంపికయ్యారు. ఈసందర్భంగా క్రీడాకారులను నెట్‌బాల్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు దీప్తి, కార్యదర్శి ఎన్.ఫణికుమార్, కోచ్ పీ.వీ.రమణ తదితరులు అభినందించారు.

రేపటితో ముగియనున్న 'దోస్త్' రిజిస్ట్రేషన్

ఖమ్మం సహకారనగర్: డిగ్రీ కళాశాలల్లో ప్రవేశానికి దోస్త్(డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్, తెలంగాణ) ద్వారా మొదటి విడత రిజిస్ట్రేషన్ గడువు బుధవారంతో ముగియనుందని ఎస్‌ఆర్ అండ్ బీజీఎన్‌ఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మహ్మద్ జకీరుల్లా తెలిపారు. రిజిస్ట్రేషన్‌కు బుధవారం చివరి రోజుకు కాగా... గురువారం వరకు ఆప్షన్లు ఇచ్చుకోవచ్చని వెల్లడించారు. అలాగే, రెండో విడత రిజిస్ట్రేషన్లు ఈనెల 30 నుంచి జూన్ 9వరకు ఉంటాయని తెలిపారు. వివరాల కోసం దోస్త్ కోఆర్డినేటర్ సలీం పాషా(98498 41555), టెక్నికల్ అసిస్టెంట్ వేలాద్రి(96188 96949)ని సంప్రదించాలని సూచించారు.

రూ.వెయ్యి కోట్లు.. అంతకు మించి..



ఎస్‌హెచ్‌సీలకు రుణ లక్ష్యం రూ.1,112.70 కోట్లు

- ఈ ఆర్థిక సంవత్సరంలో మంజూరు చేసేలా ప్రణాళిక
- రూరల్ మండలానికి అత్యధికంగా రూ.83.07 కోట్లు
- స్వయం ఉపాధిపై ఆసక్తితో ముందుకొస్తున్న మహిళలు

ఖమ్మంమయూరిసెంటర్: మహిళలు స్వయం శక్తితో ఎదిగేలా వ్యాపారాలు ఏర్పాటుచేసుకునేందుకు ప్రభుత్వం చేయూతనిస్తోంది. ఇందులో భాగంగా స్వయం సహాయక సంఘాలుగా ఏర్పడిన వారికి రుణాలు అందిస్తోంది. ఈ రుణాలు వ్యాపారాలు చేస్తున్న మహిళలు ఆర్థికంగా ఎదుగుతూ కుటుంబానికే కాక ఇంకొందరికి అండగా నిలుస్తున్నారు. ఇప్పటికే జిల్లాలోని పలు స్వయం సహాయక సంఘాల సభ్యులు రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలుస్తున్నారు. 2024–25 ఆర్థిక సంవత్సరంలో జిల్లాలోని 21,348 సంఘాలకు రూ.1,113.32 కోట్లు రుణాలు మంజూరు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించింది. కానీ 10,723 సంఘాలకు రూ.993.11 కోట్లు మాత్రమే అందడంతో 89.20 శాతంగా నమోదైంది. ఇక ఈ ఆర్థిక సంవత్సరం (2025–26)లో 20,092 సంఘాలకు రూ.,112.70 కోట్లు రుణం ఇవ్వాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టింది.

ప్రణాళికాయుతంగా రుణాలు

సంఘాల సభ్యులు బ్యాంకుల్లో చేస్తున్న పొదుపు, చెల్లింపులకు అనుగుణంగా వారికి అవసరమైన రుణాన్ని బ్యాంకుల ద్వారా అందించేలా జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారులు చర్యలు చేపట్టారు. గత ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన ప్రణాళికలు, ప్రభుత్వ సూచనల ఆధారంగా ఈ సంవత్సరం రుణాలు ఇవ్వాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా అధికారులు సంఘాల సభ్యులతో సమావేశాలు నిర్వహిస్తూ వారి లక్ష్యాలను సేకరించడమే కాక అవసరాలకు అనుగుణంగా రుణాల మంజూరుకు సిద్ధమవుతున్నారు.

సంఘాల బలోపేతం

సంఘంలో సభ్యులుగా చేరిన మహిళలు ప్రభుత్వం బ్యాంకుల ద్వారా ఇచ్చేలా రుణాన్ని పూర్తి స్థాయిలో వినియోగించుకుంటున్నారు. సభ్యులు బ్యాంకుల్లో తమకు అందిస్తున్న రుణం తీసుకోవడమే కాకుండా సకాలంలో రుణాన్ని తిరిగి చెల్లించడం ద్వారా సంఘాలను బలోపేతం చేసుకుంటున్నారు. ఈ రుణంతో చేస్తున్న వ్యాపారులు విజయవంతం కావడాన్ని పరిగణనలోకి తీసుకున్న బ్యాంకర్లు.. మరో దఫా రుణ మొత్తాన్ని పెంచడానికి వెనుకాడడం లేదు. దీంతో సంఘంలోని సభ్యులకు విడివిడిగా కావాల్సినంత మేర రుణాలు అందుతున్నాయి. పలువురు టైలరింగ్, డెయిరీఫాం, కిరాణం, చిరు వ్యాపారాలు పెట్టుకుని మహిళలు జీవనోపాధి పొందుతున్నారు. జిల్లాలో 25వేలకు పైగా సహాయక సంఘాలు ఉండగా.. అందులో 2.58 లక్షల మంది సభ్యులు ఉన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం 20,092 సంఘాలు బ్యాంక్ లింకేజీ రుణానికి అర్హత సాధించాయి. ఆయా సంఘాలకు ప్రభుత్వం రూ.1,112.70 కోట్ల రునం ఇవ్వాలని నిర్ణయించింది.

మండలాల వారీగా రుణ లక్ష్యం ఇలా..



మండలం	ఎస్‌ఎస్‌జీలు	రుణ లక్ష్యం(రూ.లలో)	మండలం	ఎస్‌ఎస్‌జీలు	రుణ లక్ష్యం(రూ.లలో)
ఖమ్మం రూరల్	1,497	83,07,41,000	సింగరేణి (కారేపల్లి)	978	53,74,46,000
కల్లూరు	1,362	75,42,84,000	ఎర్రుపాలెం	959	53,07,90,000
తిరుమలాయపాలెం	1,240	67,64,56,000	వేంసూరు	951	52,08,21,000
ముదిగొండ	1,152	64,55,29,000	తల్లాడ	920	50,83,47,000
చింతకాని	1,117	62,90,74,000	పేనుబల్లి	919	50,57,33,000
నేలకొండపల్లి	1,113	61,70,90,000	సత్తుపల్లి	889	49,58,11,000
కొణిజర్ల	1,036	57,66,78,000	కామేపల్లి	774	42,72,46,000
రఘునాథపాలెం	1,034	56,38,86,000	మధిర	759	42,93,94,000
కూసుమంచి	1,016	56,21,55,000	ఏన్కూరు	718	40,25,20,000
బోనకల్	979	53,58,67,000	వైరా	679	37,72,25,000

పాత స్టాక్‌కు కొత్త ధర!

- అమల్లోకి పెరిగిన మద్యం ధరలు
- ఇదే అదునుగా పాత స్టాక్‌కూ పెంచిన వ్యాపారులు



ఉదయం నిర్మానుష్యంగా ఉన్న వైరాలోని మద్యం డిపో

వైరా: రాష్ట్ర ప్రభుత్వం పెంచిన మద్యం ధరలు సోమవారం నుంచి అమల్లోకి వచ్చాయి. అయితే, వైన్స్, బార్లలో ఇప్పటికే స్టాక్ ఉన్న మద్యాన్ని నిబంధనల ప్రకారం పాత ధరలకే అమ్మాలి. కానీ అధికారులెవరూ ఈ దిశగా దృష్టి సారించకపోవడంతో పాత స్టాక్‌ను సైతం వ్యాపారులు కొత్త ధరతో అమ్మేసి సొమ్ము చేసుకున్నారు. ఉమ్మడి జిల్లాలోని అన్ని మద్యం దుకాణాల్లో ఇదే తంతు కొనసాగింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో బీర్ల ధరలు పెంచిన ప్రభుత్వం ఇప్పుడు లిక్కర్ ధరలు పెంచడంతో మద్యం వ్యాపారులకు కాసులు పంట పండినట్లయింది. క్వార్టర్‌పై రూ.10, ఫుల్ బాటిల్‌పై రూ.40 మేర ధర పెంచగా, ఆ ప్రకారమే పాత స్టాక్‌ను సైతం విక్రయించారు. ఉమ్మడి జిల్లాలోని వైన్స్, బార్లకు మద్యం సరఫరా చేసే వైరాలోని ఐఎంఎల్ డిపోలోనే సుమారు లక్ష కేసుల మద్యం పాత స్టాక్ ఉందని అధికారులే చెబుతున్నారు.

కొన్నింటికి మినహాయింపు

ప్రభుత్వం మద్యం ధరలు పెంచినప్పటికీ చీప్ లిక్కర్ జాబితాలో ఉన్న కొన్నింటిని మినహాయించింది. డైమండ్ విస్కీ, కేకే, డాన్‌డాన్, గుడ్‌మన్, డెక్కన్‌బ్లూ, యునైటెడ్ గోల్డు, బీకే, సన్‌హార్స్, మెగాసిటీ బ్రాండ్ల మద్యానికి పాత ధరలే అమల్లో ఉంటాయని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అలాగే, బ్రీజర్ కంపెనీలో కాన్‌బెర్రీ ధరలోనూ మార్పు చేయలేదు. బ్రాండెడ్ మద్యం ధరలే పెంచడంతో ఆదాయం పెంపే లక్ష్యంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. గత ఏడాది మే నెలలో 17వ తేదీ వరకు రూ.237 కోట్ల విలువైన మద్యం అమ్మకాలు జరిగితే ఈ ఏడాది రూ.95 కోట్ల మద్యమే అమ్ముడైంది. మరో పది రోజుల్లో గత ఏడాది కంటే ఎక్కువ అమ్మకాలు చేపట్టాలని ఎక్సైజ్ అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నట్లు సమాచారం.

మందుబాబులకు ముందే కిక్కు

పాల్వంచరూరల్: మద్యంపై పెంచిన ధరలు అమల్లోకి రావడానికి ఇంకాస్త సమయం పడుతుందని భావించిన మందుబాబులకు ఆ ఆనందం దక్కలేదు. పాల్వంచ మండలం పెద్దమ్మగుడి ఆలయం సమీపంలోని వైన్స్‌లో పాత స్టాక్‌నే కొత్త ధరకు అమ్మడంతో వాగ్వాదం జరిగింది. ఈ విషయమై పలువురు ఎక్సైజ్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఓ బ్రాండ్ మద్యం క్వార్టర్ ధర రూ.180 ఉంటే పెరిగిన ధరతో కలిపి రూ.190కు, హాఫ్, ఫుల్ బాటిళ్లు కూడా అలాగే అమ్మారని తెలిసింది. ఈవిషయమై ఎక్సైజ్ సీఐ ప్రసాద్‌గౌడ్‌ను వివరణ కోరగా షాపుల్లో ఉన్న పాత స్టాక్‌ను ధర పెంచి అమ్మితే నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఆలస్యంగా అమ్మకాలు

ప్రభుత్వం పెంచిన మద్యం ధరలు సోమవారం అమల్లోకి రాగా వైరాలోని ఐఎంఎల్ డిపో నుంచి మధ్యాహ్నం వరకు లారీలు బయటకు కదల్లేదు. కొత్త ధరలతో బిల్లింగ్ చేసేలా సాఫ్ట్‌వేర్‌లో మార్పులు చేయడంతో ఆలస్యమైందని తెలిసింది. దీంతో మధ్యాహ్నం రెండు గంటల తర్వాత డిపోలో అమ్మకాలు మొదలుకాగా, ఒకేరోజు రూ.12 కోట్ల విలువైన మద్యం తీసుకెళ్లారని సమాచారం.

విద్యుత్ ప్రజావాణి ఫిర్యాదులు పరిష్కరిస్తున్నాం



ఫిర్యాదును స్వీకరిస్తున్న ఎస్ఈ శ్రీనివాసాచారి

ఖమ్మంవ్యవసాయం: ప్రతీ సోమవారం నిర్వహించే విద్యుత్ ప్రజావాణిలో అందుతున్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామని ఖమ్మం ఎస్ఈ ఇనుగుర్తి శ్రీనివాసాచారి తెలిపారు. ఖమ్మంలోని సర్కిల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ఆయన దరఖాస్తులు స్వీకరించాక మాట్లాడారు. ఇప్పటివరకు 201 ఫిర్యాదులు అందగా, 195 సమస్యలను పరిష్కరించామని వెల్లడించారు. బిల్లుల్లో హెచ్చుతగ్గులు, మీటర్ల సమస్యలు, సరఫరాలో అవాంతరాలు, ప్రమాదకరంగా ఉన్న స్తంభాలు, లైన్లపై ఫిర్యాదు చేయొచ్చని తెలిపారు. సర్కిల్ కార్యాలయంతో పాటు డివిజన్, ఈఆర్వో, సెక్షన్ కార్యాలయాల్లోనూ ఫిర్యాదులు ఇవ్వొచ్చని ఎస్ఈ వివరించారు.

'పనిముట్టు'కుంటే ఒట్టు..

- వ్యవసాయ యాంత్రీకీకరణకు ఏళ్లుగా వీడని గ్రహణం
- నిధుల కేటాయింపుతోనే సరిపెట్టిన ప్రభుత్వం
- సమగ్ర మార్గదర్శకాలు రాక అధికారులు, రైతుల ఎదురుచూపులు
- 2016 తర్వాత అన్నదాతలకు అందని యంత్ర పరికరాలు



వ్యవసాయ పనిముట్లు

ఖమ్మంవ్యవసాయం: అన్నదాతలకు చేయూతనిచ్చేలా రూపొందించిన యాంత్రికీకరణ(పనిముట్ల) పథకానికి గ్రహణం పట్టింది. ఏళ్ల తరబడి నిధుల కేటాయింపుతోనే సరిపెడుతూ.. పరికరాలు మాత్రం కేటాయించకపోవడంతో రైతులు ఎక్కువ ఖర్చుతో కొనలేక ఆధునికతకు చేరువ కాలేకపోతున్నారు. సాగులో ఆధునిక పరికరాల వాడకంపై ఆసక్తి ఉన్నా ప్రభుత్వం నుంచి సబ్సిడీపై మంజూరు కాకపోవడం వారిని నిరాశకు గురిచేస్తోంది.

కేంద్ర, రాష్ట్రాలు సంయుక్తంగా..

అధునాతన వ్యవసాయ విధానాలకు అవసరమైన యంత్ర పరికరాలను రైతులకు అందించి, తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి సాధించేలా యాంత్రికీకరణ పథకాన్ని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అమలు చేస్తున్నాయి. ట్రాక్టర్లు, రోటోవేటర్లు, పవర్ టిల్లర్లు, డ్రోన్లు, డ్రోన్లు, సీడ్ కం ఫెర్టిలైజర్ డ్రమ్ములు, డిస్కులు, నాగండ్లు, పవర్ వీడర్లు, బ్రష్ కట్టర్లు, మొక్కజొన్న, వరి నూర్పిడి యంత్రాలే కాక గడ్డి కట్టలు కట్టేవి, పంట కోసే యంత్రాలను 50 – 90 శాతం వరకు రాయితీపై అందించాల్సి ఉంటుంది. ఇందులో 60 శాతం నిధులను కేంద్రం, 40శాతం నిధులను రాష్ట్ర ప్రభుత్వం సమకూరుస్తుంది. జనరల్, బీసీ కేటగిరీల వారికి 50 శాతం, ఎస్సీ, ఎస్టీలకు 90 శాతం వరకు రాయితీ అందుతుంది. అయితే, 2016–17 వరకు పడుతూ లేస్తూ అమలైన పథకం ఆరేళ్లుగా అమలుకు నోచుకోవడం లేదు. గత ప్రభుత్వం రైతుబంధు పథకం పేరిట ఎకరాకు రూ.5 వేల చొప్పున సాగుసాయం అందించినా యాంత్రికీరణకు పూర్తిగా పక్కన పెట్టేసింది.

అమలులో మీనమేషాలు

యాంత్రికీకరణ పథకాన్ని పునరుద్ధరిస్తున్నట్లు ప్రకటించిన ప్రస్తుత ప్రభుత్వం అమలులో మీనమేషాలు లెక్కిస్తోంది. 2024–25 సంవత్సరానికి నిధుల కేటాయించి, దరఖాస్తుల స్వీకరించాలని వ్యవసాయ శాఖను ఆదేశించినా సమగ్ర మార్గదర్శకాలను మాత్రం విడుదల చేయలేదు. యాంత్రికీకరణ పథకాన్ని 50 శాతం మహిళా రైతులకు వర్తింపచేస్తామని చెబుతూ జిల్లాకు రూ. 1.12 కోట్లను కేటాయించారు. ఈ నిధులతో అర్హులైన 428 మందికి యంత్ర పరికరాలను అందించొచ్చని భావించారు. ఆతర్వాత దరఖాస్తుల స్వీకరణ, అర్హుల ఎంపికపై ముందడుగు పడకపోవడంతో రైతులు నిరాశ చెందుతున్నారు.

సమగ్ర మార్గదర్శకాలు లేక...

ప్రభుత్వం ఆర్థిక సంవత్సం ముగుస్తున్న వేళ హడావిడిగా మార్చిలో ఈ పథకానికి నిధులు కేటాయించారు. నిర్దేశించిన యంత్ర పరికరాలను అందించేందుకు చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశాలు కూడా జారీ చేసింది. అయితే, ఆ ఆదేశాల్లోని యంత్ర పరికరాలు పరిశీలిస్తే ప్రతీ జిల్లాలో వందల సంఖ్యలో రైతులకే ప్రయోజనం చేకూరుతుందని భావించగా.. మార్పులకు సూచనలు చేసింది. దీంతో పథకం అమలు అయోమయంలో పడింది. ఇంతలోనే గత ఏడాది కేటాయించిన నిధులకు తోడు 2025–26 ఆర్థిక సంవత్సరం నిధులు కూడా కలిపి ఎక్కువ మంది రైతులకు పథకాన్ని వర్తింపజేయాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. అయితే, వానాకాలం సీజన్ సమీపిస్తున్నా ఈ విషయంలో స్పష్టత లేకపోవడంతో రైతుల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఏళ్ల తరబడి నిర్లక్ష్యం

2016–17 ఆర్థిక సంవత్సరం నుంచి వ్యవసాయ యాంత్రికీకరణ పథకం అమలు జరగడం లేదు. ఆరేళ్లకు పైగా పరికరాలను అందించకపోవటంతో రైతులు బ్యాంకులను ఆశ్రయించి రుణాలపై కొనుగోలు చేస్తున్నారు. ప్రస్తుతం ప్రభుత్వం పథకాన్ని తెరపైకి తీసుకొచ్చినా ఆచరణలో జాప్యం చేస్తుండడంతో రైతులకు పాత పరిస్థితే ఎదురుకానుంది.

ఆదేశాలు రాగానే అమలు



యాంత్రికీకరణ పథకంపై ప్రభుత్వం నుంచి వచ్చే ఆదేశాలను అమలు చేస్తాం. 2024–25 ఆర్థిక సంవత్సరానికి నిధుల కేటాయింపు జరిగింది. అయితే ఎక్కువ మందికి లబ్ధి జరగాలనే ఆలోచన చేయడంతో ప్రక్రియ నిలిచింది. ప్రభుత్వం నుంచి సమగ్ర మార్గదర్శకాలు అందితే అమలు ప్రారంభిస్తాం.

– ధనసరి పుల్లయ్య, జిల్లా వ్యవసాయాధికారి

బాలికలు ఆదర్శంగా నిలవాలి

- కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్
- కొణిజర్ల కేజీబీవీలో వేసవి శిబిరం పరిశీలన





కేజీబీవీలో బాలికల లక్ష్యాలను తెలుసుకుంటున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ (ఇన్‌సెట్) చిన్నగోపతిలో ఇళ్ల నిర్మాణాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

కొణిజర్ల: బాలికల్లో సహజసిద్ధంగా ఉండే నైపుణ్యాలకు కృషి తోడైతే అద్భుత విజయాలు సాధించవచ్చని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ తెలిపారు. ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకుని కస్తూర్బాగాంధీ విద్యాలయాల(కేజీబీవీ) బాలికలు ఉన్నత స్థాయికి చేరుకుని రాబోయే తరాలకు ఆదర్శంగా నిలవాలని సూచించారు. కొణిజర్ల మండలం బస్వాపురంలోని కేజీబీవీలో కొనసాగుతున్న వేసవి శిక్షణా శిబిరాన్ని సోమవారం సందర్శించిన ఆయన బాలికలు వేసిన చిత్రాలు, తయారుచేసిన బొకేలు, వస్తువులు పరిశీలించి అభినందించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఏ పనైనా మనస్సు, శరీరం ఏకీకృతంగా చేస్తే విజయం తథ్యమన్నారు. సమాజంలో ఆడపిల్లలపై వివక్ష తొలగిపోయేలా బాలికలు జీవితంలో రాణించాలని సూచించారు. అనంతరం ఎస్సెస్సీ, ఇంటర్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన బాలికలను కలెక్టర్ సత్కరించారు. డీఈఓ సామినేని సత్యనారాయణ, కేజీబీవీ జిల్లా కోఆర్డినేటర్ తులసి, ఇన్‌చార్జ్ తహసీల్దార్ రాము తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణంలో వేగం పెంచాలి

పైలట్ ప్రాజెక్ట్‌గా ఎంపికైన గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వేగంగా చేపట్టాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. కొణిజర్ల మండలం చిన్నగోపతిలో ఇళ్ల నిర్మాణాన్ని తనిఖీ చేసిన ఆయన లబ్ధిదారులతో మాట్లాడారు. ప్రభుత్వం నుంచి ఏమైనా సహకారం కావాలా, ఇసుక, మట్టి అందుతోందని అని ఆరా తీశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ సిమెంట్, స్టీలు వంటివి గ్రూపుగా కలిసి ఒకేచోట కొంటే ధర తగ్గుతుందని తెలిపారు. జిల్లాలోని 20మండలాల్లో ఒక్కో గ్రామాన్ని పైలట్‌గా తీసుకుని 875మందిని ఎంపిక చేశామన్నారు. దఫాలుగా బిల్లు మంజూరు చేస్తుండడమే కాక స్థోమత లేని మహిళా సంఘాల సభ్యులకు రుణం ఇప్పిస్తున్నామని తెలిపారు. అధికారులు శ్రద్ధ వహించి ఇళ్ల నిర్మాణం త్వరగా పూర్తయ్యేలా చూడాలని ఆదేశించారు. హౌసింగ్ పీడీ భూక్యా శ్రీనివాస్, డీఎల్‌పీఓ రాంబాబు, ఇన్‌చార్జి తహసీల్దార్ రాము, డీఈ సాయిరాంరెడ్డి, ఏఈ ఉమామహేశ్వరరావు, జేపీఎస్ జ్యోతి పాల్గొన్నారు.

పాఠ్య పుస్తకాల సరఫరా ప్రారంభం



పుస్తకాలను పరిశీలిస్తున్న డీఈఓ సత్యనారాయణ

ఖమ్మం సహకారనగర్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు సరఫరా చేయాల్సిన పాఠ్యపుస్తకాలు జిల్లాకు చేరుతున్నాయి. ఈమేరకు ఖమ్మంలోని గోదాంకు పుస్తకాలు చేరగా, మండలాల వారీగా పంపిణీని జిల్లా విద్యాశాఖ అధికారి సామినేని సత్యనారాయణ సోమవారం ప్రారంభించారు. సీఎంఓ యలగందుల రాజశేఖర్‌తో కలిసి ఆయన మాట్లాడారు. జిల్లా కేంద్రం నుంచి మండలాలకు, అక్కడి నుంచి పాఠశాలలకు ఈ నెలాఖరులోగా అన్ని పాఠ్యపుస్తకాలను చేరవేస్తామని తెలిపారు. ఒకటో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు మొత్తం 4,92,970 పుస్తకాలు అవసరం కాగా, ఇప్పటివరకు 3,76,380పుస్తకాలు వచ్చాయని వెల్లడించారు. మిగిలిన పుస్తకాలు, వర్క్ బుక్‌లు వారంలోగా వస్తాయని, ఇక నోటుపుస్తకాలు హైదరాబాద్ నుంచి నేరుగా పాఠశాలలకు చేరతాయని తెలిపారు. గోదాం మేనేజర్ రఫీతో పాటు పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.

సమానత్వం కోసం పోరాడేది ఎర్రజెండానే..

- సుందరయ్య వర్ధంతి సభలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ



సమావేశంలో మాట్లాడుతున్న జాన్‌వెస్లీ

తల్లాడ: సమానత్వం, సౌభ్రాతృత్వం కోసం పోరాడేది ఎర్ర జెండా మాత్రమేనని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ స్పష్టం చేశారు. పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సందర్భంగా తల్లాడ మండలం కుర్నవల్లిలో సోమవారం రాత్రి సభలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. దేశంలో కుల, మత విద్వేషాలు పెరుగుతుండగా, ఇందుకు పాలకులు వత్తాసు పలుకుతున్నారని పేర్కొన్నారు. పాలకుల విధానాలతో విద్య, వైద్యం కూడా ఖరీదు కాగా, పేదలకు కనీస మౌలిక సదుపాయాలను కల్పించడంలో విఫలమయ్యాయని తెలిపారు. అసమానతను నిర్మూలించేలా ఆనాడు పుచ్చలపల్లి సుందరయ్య వేసిన బాట నేటికీ ఆదర్శంగా నిలుస్తోందని తెలిపారు. ఆయన చూపిన బాటలో కమ్యూనిస్టులు నడుస్తూ పాలకపక్షాల ప్రజావ్యతిరేక విధానాలపై ఉద్యమించాలని జాన్‌వెస్లీ సూచించారు. తొలుత కుర్నవల్లిలో ర్యాలీ నిర్వహించగా, సీపీఎం నాయకులు మాచర్ల భారతి, శీలం సత్యనారాయణరెడ్డి, కల్యాణం వెంకటేశ్వరరావు, తాతా భాస్కర్‌రావు, చలమాల విఠల్, శీలం ఫకీరమ్మ, అయినాల రామలింగేశ్వరరావు, కట్టా దర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పంటల మార్పిడితోనే ఫలితం


కరపత్రాలు విడుదల చేస్తున్న అధికారులు

ఏన్కూరు: రైతులు పంటల మార్పిడి పాటిస్తూ మార్కెట్‌లో అధికధరలు పలికే పంటలు సాగు చేయడం ద్వారా మెరుగైన ఫలితాలు సాధించాలని వైరా కృషి విజ్ఞాన కేంద్రం కో ఆర్డినేటర్ డాక్టర్ కె.రవికుమార్ సూచించారు. ఏన్కూరు మండలం నాచారంలోని రైతు వేదికలో సోమవారం నిర్వహించిన 'రైతు ముంగిట శాస్త్రవేత్తలు' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అవసరం మేరకే ఎరువులు వినియోగిస్తూ నేల ఆరోగ్యాన్ని కాపాడాలని తెలిపారు. వైరా ఏడీఏ తుమ్మలపల్లి కరుణశ్రీ మాట్లాడుతూ వానాకాలంలో ఎంచుకోవాల్సిన పంటలు, విత్తనాల కొనుగోలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో వెటర్నటీ డాక్టర్ సుబ్బారావు, ఏఓ నరసింహారావు, తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ అధికారి తేజశ్రీ, ఏఈఓలు కమలాకర్, భాగ్యలహరి, నవ్య, భవ్య, మాజీ ఎంపీపీ వరలక్ష్మి, నల్లమల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పీహెచ్‌సీకి రూ.80వేల విలువైన ఇన్వర్టర్లు


ఆస్పత్రికి ఇన్వర్టర్లు అందజేస్తున్న పూర్ణచంద్రారెడ్డి

ఎర్రుపాలెం: మండలంలోని బనిగండ్లపాడు పీహెచ్‌సీకి కాంగ్రెస్ నాయకుడు యరమల పూర్ణచంద్రారెడ్డి రూ.80వేల విలువైన ఇన్వర్టర్లు, బ్యాటరీలు వితరణ చేశారు. ఆస్పత్రిలో సోమవారం ఆయన సామగ్రిని పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ప్రశాంత్‌కు అందచేశారు. అనంతరం డీసీసీబీ డైరెక్టర్ అయిలూరి వెంకటేశ్వరరెడ్డి, వైద్యాధికారి ప్రశాంత్ మాట్లాడుతూ పూర్ణచంద్రారెడ్డి అందించిన ఇన్వర్టర్లతో విద్యుత్ అంతరాయం ఏర్పడినప్పుడు సమస్యలు ఉండవని తెలిపారు. అనంతరం దాతను సత్కరించారు. వైద్యులు రంజిత్, కార్తీక్, లక్ష్మీ లోహిత, అశ్విని, ఉద్యోగులు పాల్గొన్నారు.

పోరాటమే సుందరయ్యకు నివాళి


సుందరయ్య విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: కేంద్రం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడడమే పుచ్చలపల్లి సుందరయ్యకు ఇచ్చే నివాళి అవుతుందని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు తెలిపా రు. ఖమ్మంలోని సుందరయ్య భవనంలో సోమవారం ఆయన ఆయన 40వ వర్ధంతి నిర్వహించారు. ఈసందర్భంగా సుందరయ్య విగ్రహం వద్ద నివాళులర్పించాక నాగేశ్వరరావు మాట్లాడారు. భారత్ – పాకిస్తాన్ నడుమ కాల్పుల విరమణ ఒప్పందంలో అమెరికా జోక్యాన్ని నిరసిస్తున్నట్లు తెలిపారు. ఈ విషయంలో రెండు దేశాల కంటే ముందు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రకటన చేయడం ద్వారా ఆయనకు మోదీ దాసోహమైనట్లు తేలుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు పి.సోమయ్య, పొన్నం వెంకటేశ్వరరావు, ఎం.సుబ్బారావు, మాచర్ల భారతి, కళ్యాణం వెంకటేశ్వరరావు, వై.విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి రెండో విడత శిక్షణ

ఖమ్మం సహకారనగర్: జిల్లాలోని ఉపాధ్యాయులకు మంగళవారం నుంచి రెండో విడత శిక్షణ ప్రా రంభం కానుందని, ఎంపిక చేసిన వారంతా హాజరుకావాలని డీఈఓ సామినేని సత్యనారాయణ పేర్కొన్నారు. ఖమ్మంలోని హార్వెస్ట్ పాఠశాల, న్యూ ఇరా పాఠశాల, న్యూవిజన్ పాఠశాలల్లో ఐదు రోజుల శిక్షణ ఉంటుందని తెలిపారు. మండలాల వారీగా ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎంలు, ఎస్‌జీటీలు సబ్జెక్ట్ పుస్తకాలు, కరదీపికలతో హాజరు కావాలని సూచించారు.

23న జిల్లాస్థాయి అథ్లెటిక్స్ ఎంపికలు

ఖమ్మం స్పోర్ట్స్: జిల్లాస్థాయి సబ్ జూనియర్ అథ్లెటిక్స్ జట్ల ఎంపికకు ఈనెల 23న కల్లూరు మినీ స్టేడియంలో పోటీలు నిర్వహిస్తున్నట్లు అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఎం.డీ.షఫీక్ అహ్మద్ తెలిపారు. అండర్–8, 10, 12 బాలబాలికల విభాగాల్లో పోటీలుజరుగుతాయని వెల్లడించారు. అండర్–8 బాలబాలికలకు 60, 200 మీటర్లు, స్టాండింగ్ బ్రాడ్‌జంప్, పరుగుపందెం, అండర్–10 బాలబాలికలకు 60, 300 మీటర్లు, లాంగ్‌జంప్, అండర్–12 బాలబాలికలకు60, 600 మీటర్లు, షాట్‌పుట్, లాంగ్‌జంప్ అంశాల్లో ఎంపికలు ఉంటాయని తెలిపారు. క్రీడాకారులు ఉదయం 8గంటలకల్లా స్టేడియం ఇన్‌చార్జ్ పి.వీరరాఘవయ్యకు రిపోర్ట్ చేయాలని సూచించారు.

ఉన్న వారిపైనే భారం !

- కేఎంసీ టౌన్ ప్లానింగ్ విభాగంలో వేధిస్తోన్న సిబ్బంది కొరత
- కార్పొరేషన్‌కు కొత్తగా మంజూరు కాని పోస్టులు
- మున్సిపాలిటీ నాటి పోస్టులతో ఇక్కట్లు


కేఎంసీలోని టౌన్ ప్లానింగ్ విభాగం

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయంలో ప్రధాన విభాగమే కాదు నగర అభివృద్ధిలో కీలక పాత్ర పోషించే టౌన్ ప్లానింగ్ విభాగాన్ని సిబ్బంది కొరత వేధిస్తోంది. నగర విస్తరణ, అభివృద్ధి పనుల ప్రణాళికలు, పరిశీలన ఈ విభాగం ద్వారానే జరుగుతాయి. నిర్మాణాలకు అనుమతుల జారీ, నిర్మాణాల పర్యవేక్షణ, కార్పొరేషన్‌లో రోడ్లు, డ్రెయినేజీలపై ఆక్రమణలను గుర్తింపు, తొలగింపు బాధ్యతలు నిర్వర్తించాల్సిన ఈ విభాగంలో ఉద్యోగులు, సిబ్బంది కొరత వేధిస్తుండగా.. ఉన్న వారిపై పనిభారం పడుతోంది.

వేధిస్తున్న సిబ్బంది కొరత

పురపాలక సంఘం నుండి నగర పాలక సంస్థగా రూపాంతరం చెందిన ఖమ్మం కార్పొరేషన్‌కు ఆ స్థాయిలో ఉద్యోగులను కేటాయించలేదు. స్పెషల్ గ్రేడ్ మున్సిపాలిటీగా ఉన్న ఖమ్మంను 2012 అక్టోబర్‌లో ప్రభుత్వం నగర పాలక సంస్థగా ప్రకటించింది. విలీన గ్రామాలను కలుపుకుని 60డివిజన్లతో ఖమ్మం కార్పొరేషన్ రోజురోజుకు విస్తరిస్తోంది. కానీ మున్సిపాలిటిగా ఉన్నప్పుడు టౌన్‌ప్లానింగ్ విభాగానికి కేటాయించిన పోస్టులతోనే నేటికీ ఇప్పటికీ నెట్టుకొస్తుండడంతో ప్రజా సేవలతో పాటు అభివృద్ధి పనుల పర్యవేక్షణపై ప్రభావం పడుతోంది.

పోస్టులు ఏవీ?

ఖమ్మం పురపాలక సంఘంగా ఉన్న నాటి పోస్టులతోనే ప్రస్తుతం పరిపాలన నెట్టుకొస్తున్నారు. ఖమ్మం మున్సిపాలిటీ టౌన్‌ప్లానింగ్ విభాగానికి తొమ్మిది పోస్టులను మంజూరు చేశారు. ఇందులో ఏసీపీ, టీపీఓ ఒక్కొక్కరితో పాటు టీపీఎస్ మూడు, టీపీబీఓ పోస్టులు నాలుగు ఉన్నాయి. ప్రస్తుతం ఏసీపీ, టీపీఓ ఒక్కొక్కరు, టీపీఎస్‌లు ఇద్దరు, టీపీబీఓలు నలుగురు విధుల్లో ఉన్నారు. టీపీబీలు ఇటీవలే బాధ్యతలు చేపట్టగా శిక్షణ పొందుతున్నారు. ఖమ్మం నగరం విస్తరణ దృష్ట్యా టౌన్ ప్లానింగ్ విభాగానికి పోస్టుల సంఖ్య పెంచాల్సి ఉంది. అసలే ఉద్యోగులు తక్కువగా ఉండడంతో కార్యకలాపాలపై ప్రభావం పడుతుండగా.. ఇటీవల ఈ విభాగం ఉద్యోగులకు ఇతర మున్సిపాలిటీల్లో అదనపు విధులు కేటాయిస్తున్నారు. దీంతో రెండు చోట్ల సరైన న్యాయం చేయలేకపోతున్నారు.

పనులన్నీ అక్కడే..

ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ ఫీజులు చెల్లింపునకు రాయితీ ప్రకటించడంతో కేఎంసీ టౌన్‌ప్లానింగ్ విభాగం ప్రత్యేక దృష్టి సారించారు. 40 వేల దరఖాస్తులు రాగా.. అత్యధిక ఫీజులు వసూలు చేసిన కార్పొరేషన్‌గా ఖమ్మం నిలిచింది. ఈ పనులతో పాటు నగరంలో ఆక్రమణల తొలగింపుకు కృషి చేస్తున్నారు. మరోపక్క రోడ్ల విస్తరణ ప్రణాళికల రూపకల్పన, మార్కింగ్ పెట్టడం, విస్తరణ పనులను పర్యవేక్షించడం బాధ్యతలు నిర్వర్తించాలి. అదనంగా రోజువారీగా నిర్మాణాలకు అనుమతుల కోసం వచ్చే దరఖాస్తులను పరిశీలించడం, క్షేత్ర స్థాయికి వెళ్లి తనిఖీ చేయాల్సి ఉండడంతో పనుల్లో ఆలస్యమవుతోందనే చర్చ కేఎంసీలో జరుగుతోంది. కాగా, ఉద్యోగులు పనిభారం కారణంగా కొన్ని చోట్ల పర్యవేక్షించకపోవడంతో అక్రమార్కులు ఇదే అదునుగా అనుమతులు లేకుండానే నిర్మాణాలు చేపడుతున్నారని చెబుతున్నారు.

ఫిర్యాదులు తక్షణమే పరిష్కరించండి

- తిరస్కరిస్తే అందుకు కారణాలు వెల్లడించాలి
- కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్


ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మం సహకారనగర్: ప్రజలు అందించే ప్రతీ ఫిర్యాదును క్షుణ్ణంగా పరిశీలించి ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఆదేశించారు. ఏవైనా తిరస్కరిస్తే అందుకు కారణాలను ఫిర్యాదుదారులకు తెలియచేయాలని చెప్పారు. ప్రజావాణిలో భాగంగా సోమవారం ఆయన అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డితో కలిసి ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులను స్వీకరించారు. అనంతరం వివిధ శాఖల అధికారులతో సమావేశమై పరిశీలన, పరిష్కారంపై సూచనలు చేశారు. ఈకార్యక్రమంలో డీఆర్వో పద్మశ్రీ, డీఆర్‌డీఓ సన్యాసయ్య తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదుల్లో కొన్ని...

- ఖమ్మంకు చెందిన సింగాల నాగమణి తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరారు. అలాగే, బీ.కే.బజార్‌కు చెందిన ఏ.శ్రీలక్ష్మి ఒంటరినైనా తనకు ఉపాధి కల్పించచడంతో పాటు ఇల్లు ఇప్పించాలని విన్నవించారు.
- పెనుబల్లి మండలం తాళ్లపెంటకు చెందిన షేక్ ఉద్దండు సాహెబ్ తమ ఇంటి నుండి ఊరిలోకి వెళ్లకుండా కంచె ఏర్పాటుచేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.
- ఇందిరమ్మ ఇళ్లలో దివ్యాంగులకు ప్రాధాన్యత ఇవ్వాలని టీడీజేఏసీ చైర్మన్ పీ.వీ.చలమయ్య ఆధ్వర్యాన వినతిపత్రం అందజేశారు. నాయకులు రామకృష్ణ, బ్రహ్మయ్య, వెంకట్, గోపిరాజ్, రేణుక పాల్గొన్నారు.
- రఘునాథపాలెం మండలం పువ్వాడ ఉదయ్‌నగర్ కాలనీలో బీ.ఆర్ అంబేద్కర్ పేరుతో కమ్యూనిటీ హాల్‌ను ఏర్పాటు చేయాలని వీర నారీమణుల ఆశయ సాధన సమితి జిల్లా జిల్లా అధ్యక్షురాలు భూక్య ఉపేంద్రబాయి ఆధ్వర్యాన వినతిపత్రం అందజేశారు.
- కేఎంసీ పరిధిలోని సమస్యల పరిష్కారం, అర్హులకు సంక్షేమ పథకాల మంజూరుపై సీపీఐ నాయకులు విన్నవించారు. సీపీఐ నగర కార్యదర్శి ఎస్.కే.జానీమియా, నాయకులు పాల్గొన్నారు.
- చింతకాని మండలం రైల్వే కాలనీలో ఇందిరమ్మ కమిటీ బాధ్యులు అర్హులకు కాకుండా అనర్హులకు ఇల్లు కేటాయించారని ఆరోపిస్తూ బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు చెరుకుపల్లి నాగేశ్వరావు ఆధ్వర్యాన నిరసన తెలిపి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

పకడ్బందీగా సప్లిమెంటరీ పరీక్షలు

- అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి
- విద్యాశాఖ అధికారులతో సమీక్షలో సూచనలు


మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, పక్కన డీఐఈఓ రవిబాబు, అధికారులు

ఖమ్మం సహకారనగర్: ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లమెంటరీ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేలా ఏర్పాటుచేయాలని అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అన్ని కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటుచేయడమే కాక ఇతర ఏర్పాట్లు చేయాలని తెలిపారు. అంతకుముందే నయాబజార్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చీఫ్ డిపార్ట్‌మెంటల్ అధికారి, డిపార్ట్‌మెంటల్ అధికారులతో డీఐఈఓ రవిబాబు సమావేశమయ్యారు. కేంద్రాల వద్ద నిబంధనలు, ఏర్పాట్లపై సూచనలు చేశారు. డీఈసీ మెంబర్లు కె.శ్రీనివాసరావు, వీరభద్రరావు పాల్గొన్నారు.

22నుంచి పరీక్షలు

ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లమెంటరీ పరీక్షలు ఈనెల 22వ తేదీ నుంచి 28వ తేదీ వరకు నిర్వహించనున్నారు. జిల్లాలో 15,461మంది విద్యార్థుల కోసం 38 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. విద్యార్థుల్లో ప్రథమ సంవత్సరం 11,780మంది, ద్వితీయ సంవత్సరం 3,681మంది ఉన్నారు. కాగా, జిల్లాను నాలుగు రూట్లుగా విభజించి, 17స్టోరేజ్ పాయింట్లు ఏర్పాటు చేశారు. ఇద్దరు చొప్పున అధికారులతో మూడు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటుచేసి ఇప్పటికే విధులపై అవగాహన కల్పించారు. కాగా, ప్రథమ సంవత్సరం పరీక్షలు ఉదయం 9నుంచి 12గంటల వరకు, ద్వితీయ సంవత్సరం పరీక్షలు మధ్యాహ్నం 2–30 నుంచి 5–30గంటల వరకు నిర్వహిస్తారు. కాగా, ఈ నెల 25న ఆదివారం కూడా పరీక్షలు జరుగుతాయని అధికారులు తెలిపారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని నయాబజార్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటుచేయగా, అక్కడి నుంచి సామగ్రి సరఫరా చేస్తారు.

ఉపాధ్యాయుల బకాయిలు విడుదల చేయాలి


కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న యూటీఎఫ్ బాధ్యులు

ఖమ్మం సహకారనగర్: సమగ్ర కుటుంబ సర్వే నిర్వహించిన ఉద్యోగ, ఉపాధ్యాయులకే కాక పదో తరగతి మూల్యాంకనలో పాల్గొన్న ఉపాధ్యాయుల రెమ్యూనరేషన్ బకాయిలు మంజూరు చేయాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్ రంజాన్, పారుపల్లి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపి కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌కు వినతిపత్రం సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఉపాధ్యాయ, ఉద్యోగులు 2024 నవంబర్‌లో సమగ్ర కుటుంబ సర్వేలో పాల్గొనగా ఇప్పటివరకు రెమ్యునరేషన్ ఇవ్వలేదన్నారు. ఈ–కుబేర్‌లో పెండింగ్ పెట్టారని తెలిపారు. అంతేకాక 2022లో పదో తరగతి స్పాట్ విధులు నిర్వర్తించిన ఆంగ్లం, గణితం ఉపాధ్యాయులకు బకాయిలు విడుదల చేయాల్సి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బుర్రి వెంకన్న, వల్లంకొండరాంబాబు, నాగేశ్వరరావు, ఉద్దండు షరీఫ్,విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కేర్ టేకర్‌గా చేరి రూ.11.49లక్షలు స్వాహా


నిందితుడితో డీఎస్పీ, ఉద్యోగులు

ఖమ్మంక్రైం: ఆన్‌లైన్ బెట్టింగ్‌కు అలవాటు పడిన ఓ వ్యక్తి రిటైర్డ్ ఉద్యోగి వద్ద కేర్ టేకర్‌గా చేరి ఆయనకు తెలియకుండా ఖాతా నుంచి రూ.11.49 లక్షలు స్వాహా చేశాడు. ఈమేరకు నిందితుడిని సోమవారం ఖమ్మం సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారని పోలీసు కమిషనర్ సునీల్‌దత్ తెలిపారు. మధిర మండలం నిదానపురానికి చెందిన గుండా వెంకటేశ్వరరెడ్డి ఖమ్మం హోమ్ కేర్ సర్వీస్‌లో కేర్ టేకర్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. గత నాలుగైదేళ్లుగా ఆన్‌లైన్ బెట్టింగ్‌కు పాల్పడుతున్న ఆయన గత మార్చిలో ఖమ్మంకు చెందిన రిటైర్డ్ ఉద్యోగి గాదె కేశవరావు వద్ద కేర్ టేకర్‌గా చేరాడు. యజమానిని నమ్మిస్తూ ఆయన ఫోన్‌లోని గూగుల్ పే ద్వారా బెట్టింగ్ యాప్‌ల్లోకి డబ్బు డిపాజిట్ చేయడం మొదలుపెట్టాడు. రెండు వారాల పాటు వరుసగా రూ.11.49 లక్షల డిపాజిట్ చేయగా, లాభాలు రాకపోవడంతో ఉద్యోగం మానేశాడు. కొన్నాళ్ల తర్వాత గుర్తించిన కేశవరావు ఈ విషయమై చేసిన ఫిర్యాదుతో వెంకటేశ్వరరెడ్డిని అదుపులోకి తీసుకుని విచారించడంతో నేరం చేసినట్లు ఒప్పుకున్నాడు. దీంతో కోర్టులో హాజరుపర్చగా, సైబర్ క్రైమ్ డీఎస్పీ ఫణిందర్‌ను, ఎస్సైలు రంజిత్‌కుమార్,విజయ్‌కుమార్, సిబ్బందిని సీపీ అభినందించారు.

తిరంగా ర్యాలీలో ఉద్రిక్తత

ఇరువర్గాల నడుమ ఘర్షణ

ఖమ్మంక్రైం: ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావడంపై ఖమ్మంలో సోమవారం రాత్రి నిర్వహించిన తిరంగా ర్యాలీలో ఇరువర్గాల మధ్య ఘర్షణ తలెత్తింది. ర్యాలీ ఇల్లెందు క్రాస్ రోడ్డు మీదుగా సాగుతుండగా ఓ వర్గం వారు ఎదురొచ్చి దాయాది దేశానికి అనుకూలంగా నినాదాలు చేసినట్లు తెలిసింది. దీంతో ర్యాలీలో ఉన్న నాయకులు జై భారత్ అంటూ నినదించడంతో మాటామాట పెరిగి ఘర్షణకు దారితీసింది. ఈ సమాచారం అందుకున్న పోలీసులు ఏసీపీ రమణమూర్తి ఆధ్వర్యాన చేరుకుని ఇరువర్గాల వారిని చెదరగొట్టారు. అనంతరం ఘర్షణకు కారణమైన పలువురిని టూటౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఇంతలోనే రెండు వర్గాలకు చెందిన వారు భారీగా స్టేషన్ సమీపానికి చేరుకున్నారు. దీంతో ఇరువర్గాల నాయకులను పోలీసులు పిలిపించి సముదాయించడంతో ఆందోళన సద్దుమణిగింది.

నేడు ఖమ్మం బంద్

ఖమ్మం మామిళ్లగూడెం: తిరంగా ర్యాలీలో చోటుచేసుకున్న ఘర్షణకు సంబంధించి బీజేపీ నాయకులు మంగళవారం ఖమ్మం బంద్‌కు పిలుపునిచ్చారు. ఆందోళన విషయాన్ని కేంద్ర మంత్రి బండి సంజయ్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన ఖమ్మం వస్తున్నట్లు తెలిపారని పేర్కొన్నారు. ఈ మేరకు నగరవాసులు బంద్‌ను విజయవంతం చేయాలని నాయకుల కోరారు.

వడదెబ్బతో ముగ్గురు మృతి

రఘునాథపాలెం: ఎండల కారణంగా వడదెబ్బ బారిన వ్యక్తి డంపింగ్ యార్డులో మృతి చెందగా సోమవారం గుర్తించారు. ఖమ్మం ప్రకాష్‌నగర్‌కు దాసు తన రెండో భార్యతో కలిసి బొప్పాయికాయలు అమ్ముతూ జీవనం సాగిస్తున్నాడు. ఆయన భార్యతో ఘర్షణ పడి రఘునాథపాలెం మండలం వీ.వీ.పాలెంలోని డంప్ యార్డుకు వచ్చినట్లు తెలుస్తుండగా, అక్కడే నిద్రించిన ఆయన మృతి చెందాడు. వడదెబ్బతో దాసు మృతి చెంది ఉండొచ్చని భావిస్తూ ఆయన కుమార్తె ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు సీఐ ఉస్మాన్ షరీఫ్ తెలిపారు. కాగా, ఉదయమే డంప్ యార్డులో మృతదేహాన్ని గుర్తించిన పంచాయతీ ఆందోళనతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. అన్నం ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావు, సిబ్బంది సదరు వ్యక్తిమృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించగా సామాజిక మాధ్యమాల్లో ఫొటోలు విడుదల చేయడంతో దాసు కుటుంబీకులు గుర్తించారు.

సుందరయ్యనగర్‌లో మహిళ...

వైరా: వైరా మున్సిపాలిటీ లీలా సుందరయ్యనగర్‌కు చెందిన రేకుల ముత్తమ్మ(49) వడదెబ్బతో మృతి చెందింది. ఈనెల 15న ఆమె బంధువుల ఇంటికి వెళ్లి 17న తిరిగి వచ్చినప్పటి నుంచి వాంతులు, విరోచనాలతో బాధ పడుతంది. స్థానికంగా చికిత్స చేయిస్తుండగా పరిస్థితి విషమించి సోమవారం మృతి చెందింది. ముత్తమ్మ భర్త శంకరరావు ఫిర్యాదుతో కేసు నమోదు చేశామిన ఎస్ఐ రామారావు తెలిపారు.

చింతకాని ఐఈఆర్పీ...


కేఎస్.కృష్ణారావు (ఫైల్)

చింతకాని: మండల ఐఈఆర్పీ (ఇన్‌క్లూసివ్ ఎడ్యుకేషన్ రిసోర్స్ పర్సన్) కేఎస్.కృష్ణారావు (57) సోమవారం మృతి చెందాడు. రెండు రోజుల వడదెబ్బ తాకడంతో ఖమ్మం ఆస్పత్రిల చేర్పించగా చికిత్స పొందుతూ మృతి చెందాడని కుటుంబీకులు తెలిపారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కృష్ణారావుపై మృతిపై ఎంపీడీఓ శ్రీనివాసరావు, తహసీల్దార్ కూరపాటి అనంతరాజు, ఎంఈఓ సలాది రామారావు తదితరులు సంతాపం తెలిపారు.

అలా వచ్చి... ఇలా వెళ్లారు!

పీసీబీ ఉద్యోగుల తీరుపై రైతుల ఆగ్రహం


ఉద్యోగులకు గోడు వినిపిస్తున్న రైతులు

నేలకొండపల్లి: ఫ్యాక్టరీ కారణంగా పంటలు నష్టపోతున్నామని, మూగజీవాలు మృత్యువాత పడుతున్నాయని ఫిర్యాదు చేస్తే పంట కోతలు పూర్తయ్యాక వచ్చిన కాలుష్య నియంత్రణ మండలి(పీసీబీ) ఉద్యోగులు కొద్దిసేపటికే వెళ్లిపోవడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని అప్పలనరసింహాపురంలో ఉన్న ఐరన్ ఓర్, కెమికల్ ఫ్యాక్టరీల కారణంగా పంటలుపై దుమ్ము, దూళి చేరుతోందని, నీరు కలుషితమవుతోందని రైతులు ఈ ఏడాది ఫిబవరి 3న చెన్నై, హైదరాబాద్‌లో కాలుష్య నియంత్రణ మండలి అధికారులకు ఫిర్యాదు చేశారు. అప్పట్లో రాకుండా పంట కోతలు పూర్తయ్యాక టాస్క్‌ఫోర్స్ సభ్యులు శ్రీధర్, గోపాల్, కొత్తగూడెం ఏఈ అజయ్ సోమవారం వచ్చారు. దీంతో వారి ఎదుట రైతులు ఆవేదన వెలిబుచ్చారు. పంటలు ఉన్న సమయాన వస్తే తమ ఇబ్బందులు తెలిసేవని పేర్కొన్నారు. ఇకనైనా ఫ్యాక్టరీలపై చర్యలు తీసుకోకపోతే పీసీబీ కార్యాలయం వద్ద ఆత్మహత్య చేసుకుంటామని హెచ్చరించారు. అయితే, ఎలాంటి హామీ ఇవ్వకుండా ఉద్యోగులు కాసేపటికే వెళ్లిపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. రైతులు ఎలగాల మీరయ్య, జిడుగు లక్ష్మీనారాయణ, బి.భాస్కర్, వెనికె రామారావు, వై.పిచ్చయ్య, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

వరకట్న వేధింపుల కేసులో మూడేళ్ల జైలుశిక్ష

ఖమ్మం లీగల్: వరకట్నం కోసం వేధించిన కేసులో ఏన్కూరు మండలం తూతకలింగన్నపేటకు చెందిన నామా నరేష్‌కు మూడేళ్ల జైలుశిక్షతో పాటు రూ.10 వేల జరిమానా విధిస్తూ ఖమ్మం మొదటి అదనపు అసిస్టెంట్ సెషన్స్ కోర్టు న్యాయాధికారి శివరంజని సోమవారం తీర్పు చెప్పారు. వివరాలిలా ఉన్నాయి. జిల్లాకు చెందిన శ్రీనివాసరావు తన కుమార్తెను 2011 మే 27న నరేష్‌కు ఇచ్చి వివాహం జరిపించాడు. కొన్నేళ్లు సంసారం సజావుగానే సాగాక అదనపు కట్నం కోసం ఆమెను భర్త, అత్తమామలు వేధిస్తుండడంతో 2019 జూన్ 9న అత్తగారింట్లో ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. ఘటనపై శ్రీనివాసరావు చేసిన ఫిర్యాదుతో విచారణ అనంతరం పోలీసులు కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. ఈమేరకు 12మంది సాక్షులను విచారించి, సాక్ష్యాధారాల మేరకు నరేష్‌కు జైలుశిక్ష, జరిమానా విధించగా, ఆయన తల్లిదండ్రులపై కేసు కొట్టేశారు. ప్రాసిక్యూషన్ తరఫున పీపీ స్వప్న వాదించగా, ఉద్యోగులు కె.శ్రీకాంత్, భరత్, శ్రీనివాసరావు సహకరించారు.

చెల్లని చెక్కు కేసులో ఆరు నెలలు...

అప్పు చెల్లించే క్రమాన ఇచ్చిన చెక్కు చెల్లకపోవడంతో ఖమ్మం ఖానాపురానికి చెందిన తుమరాడ సింహాచలంకు ఆరు నెలల జైలు శిక్ష విధిస్తూ ఖమ్మం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయాధికారి దీప సోమవారం తీర్పు చెప్పారు. పాండురంగాపురానికి చెందిన భూక్యా కృష్ణశేఖర్ వద్ద సింహాచలం 2017 జనవరిలో రూ.4 లక్షల అప్పు తీసుకున్నాడు. ఆతర్వాత 2018 జనవరి 5న రూ.4.20 లక్షలకు చెక్కు జారీచేయగా ఆయనఖాతాలో సరిపడా నగదు లేక తిరస్కరణకు గురైంది. దీంతో కృష్ణశేఖర్ తన న్యాయవాది ద్వారా లీగల్ నోటీస్ జారీ చేసి కోర్టులో ప్రైవేట్ కేసు దాఖలు చేశాడు. కేసు విచారణ అనంతరం సింహాచలానికి జైలుశిక్ష విధించడమే కాక ఫిర్యాదికి పరిహారం చెల్లించాలని తీర్పు చెప్పారు.

బైక్‌ను లారీ ఢీకొట్టడంతో వ్యక్తి మృతి


శంకర్‌రావు (ఫైల్)

ఖమ్మంరూరల్: మండలంలోని వరంగల్ క్రాస్ రోడ్డులో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఖమ్మంకు చెందిన ఈగలపాటి శంకర్‌రావు(60) మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు... కూసుమంచి మండలం జక్కేపల్లికి చెందిన శంకర్‌రావు ఖమ్మంలో ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ అక్కడే నివాసముంటున్నాడు. జక్కేపల్లిలో ఉండే తల్లి ఆరోగ్యం బాగా లేకపోవడంతో చూసి బైక్‌పై ఖమ్మం వస్తుండగా వెనుక నుండి అతివేగంగా వచ్చిన లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో తలకు తీవ్ర గాయాలైనశంకర్‌రావు అక్కడికక్కడే మృతి చెందాడు. ఆయన భార్య, ఇద్దరు పిల్లలు ఉండగా, కేసు నమోదు చేసినట్లు సీఐ ముష్క రాజు తెలిపారు.

కుక్కల దాడిలో పలువురికి గాయాలు

మధిర: మధిర మున్సిపాలిటీ పరిధి మడుపల్లిలో ఆదివారం వీధికుక్కలు స్వైర విహారం చేశాయి. కుక్కల దాడిలో మేడికొండ రమణమ్మ, మేడికొండ మురళీధర్, ఎస్.కే.మస్తాన్‌తో పాటు మరో ముగ్గురికి గయాలయ్యాయి. గతంలో ఇదే గ్రామానికి చెందిన ఇద్దరు కుక్కల దాడిలో తీవ్రంగా గాయపడి మృతి చెందారు. ఈనేపథ్యాన అధికారులు స్పందించి కుక్కల బెడద నుంచి రక్షించాలని స్థానికులు కోరుతున్నారు.

పిడుగుపాటుతో దంపతులకు గాయాలు

- పెంపుడు కుక్క సహా 22 మూగజీవాలు మృతి


లక్ష్మయ్య-లక్ష్మిని ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

కారేపల్లి: పిడుగుపాటుతో ఇద్దరు జీవాల కాపరులకు తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటనలో వీరు మేతకు తీసుకొచ్చిన 21 గొర్రెలు, ఒక కుక్క మృత్యువాత పడింది. మండలంలోని బాజుమల్లాయిగూడెంకు గొర్రెల కాపరులు మద్దెల లక్ష్మయ్య–లక్ష్మి 100జీవాలను సోమవారం సమీపంలోని పాటిమీదిగుంపు గ్రామంలో మేతకు తీసుకెళ్లారు. సాయంత్రం ఒక్కసారిగా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం మొదలు కావడంతో సమీపంలోని చెట్టు కిందకు చేరగా వేపచెట్టుపై పిడుగు పడింది. దీంతో లక్ష్మయ్య–లక్ష్మి దంపతులు తీవ్రగాయాలతో స్పృహ కోల్పోగా, 17 గొర్రెలు, వారి పెంపుడు కుక్క మృతి చెందింది. అలాగే, పిడుగుపాటుతో చెట్టు సగం మేర కాలిపోయింది. అరగంట తర్వాత స్పృహలోకి వచ్చిన లక్ష్మయ్య ఫోన్ ద్వారా గ్రామస్తులకు సమాచారం ఇవ్వడంతో స్థానికులు చేరుకుని వారిని ఖమ్మం ఆస్పత్రికి తరలించారు.